సాక్షి అనకాపల్లి

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



స్పందన అర్జీలపై విచారణ

స్పందనకు సోమవారం 146 అర్జీలు వచ్చాయి. ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం కన్నుల పండువగా జరిగింది.



శ్రీనగర్‌లో జీవీఎంసీ బృందం

విశాఖ: జీవీఎంసీ కార్పొరేటర్ల బృందం సోమవారం శ్రీనగర్‌ను సందర్శించింది. అక్కడి మేయర్ జునైద్ అజీమ్ స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

జిల్లాలో పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్ అమలు

- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ మురళీకృష్ణ



అనకాపల్లి టౌన్: రాష్ట్ర పోలీస్‌శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్ అమల్లో ఉందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిరసనలు, ధర్నా లు, బంద్‌కు అనుమతించలేదని చెప్పారు. బస్సులు, రైళ్ల తిరిగేందుకు ఆటంకాలు కలిగించినా, పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార సముదాయలను బలవంతంగా మూయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల సాధారణ జనజీవనం, రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలిగించినా కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపైకి వచ్చి అల్లర్లు చేసినా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు.

అమర వీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న సోషల్ ఫారెస్ట్ జిల్లా అధికారి జి.లక్ష్మణ్

అనకాపల్లి టౌన్: జిల్లా సోషల్ ఫారెస్ట్ డివిజన్ కార్యాలయంలో సోమవారం జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అమరవీరుల చిత్రపటానికి సోషల్ ఫారెస్ట్ జిల్లా అధికారి జి.లక్ష్మణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో అసువులు బాసిన అటవీ శాఖ సిబ్బంది సేవలు వెలకట్టలేనివన్నారు. క్రమశిక్షణతో విధి నిర్వహించిన వారికి సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, యలమంచిలి ఎఫ్ఆర్‌వో లావణ్య, నర్సీపట్నం ఎఫ్ఆర్‌వో సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక విద్య పరీక్ష ఫీజు గడువు వచ్చే నెల 15

అనకాపల్లిటౌన్: వచ్చే ఏడాది(2024)లో జరిగే సార్వత్రిక విద్యాపీఠం టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకాగోరు విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ ఏడాది అక్టోబర్ 15 లోపు చెల్లించాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చొప్పున చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

తుస్సుమన్న బంద్



అనకాపల్లి మెయిన్‌రోడ్డులో తెరిచి ఉన్న దుకాణాలు



వడ్డాది జంక్షన్‌లో యథావిధిగా తిరుగుతున్న వాహనాలు

- టీడీపీ పిలుపునకు కానరాని స్పందన
- యథావిధిగా కార్యకలాపాలు
- తెరుచుకున్న దుకాణాలు

సాక్షి, అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపు విఫలమైంది. యథావిధిగా ప్రజా జీవనం కొనసాగింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడాన్ని నిరసిస్తూ టీడీపీ సోమవారం బంద్‌కు పిలుపునిచ్చింది. దీనికి జనసేన, వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. ఈ బంద్‌ను ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రజలెవరూ పట్టించుకోలేదు. యథావిధిగా రోడ్లపైకి వచ్చి.. తమ పనుల్లో మునిగిపోగా.. ప్రజా రవాణా వ్యవస్థ సైతం ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగాయి. విశాఖ రీజియన్ పరిధిలో 684 బస్సులు షెడ్యూల్ ప్రకారం తిరిగాయి. దాదాపు అన్ని దుకాణాలు తెరుచుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో తరగతులు కొనసాగాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షలు యథాతథంగా జరిగాయి.

బంద్‌కు దూరంగా..

అధిష్టానం బంద్‌కు పిలుపునిచ్చినా జిల్లాలోని టీడీపీ నేతలు పెద్దగా పట్టించుకోలేదు. జనసేనకు చెందిన నేతలు, వామపక్ష నాయకులు సైతం బంద్ గురించి స్పందించలేదు. కొందరు కార్యకర్తలు మాత్రమే రోడ్డెక్కి హడావిడి చేశారు. ద్వితీయ శ్రేణి నేతలు బంద్‌కు దూరంగా ఉన్నారు. అసలు చంద్రబాబును అరెస్ట్ చేస్తే.. తమకేంటి సంబంధం అన్నట్లుగా ప్రజలే కాదు.. టీడీపీ, జనసేన శ్రేణులు సైతం వ్యవహరించడం గమనార్హం. కొందరు టీడీపీ కార్యకర్తలు జెండాలతో హడావుడి చేస్తున్నా.. జనాలు అవేమి పట్టించుకోకుండా తమ పనులు తాము చేసుకున్నారు.



మునగపాకలో హైస్కూల్ మూసివేయాలని ఒత్తిడి చేస్తున్న టీడీపీ శ్రేణులు



అనకాపల్లి నెహ్రూచౌక్ బస్‌షెల్టర్ వద్ద ప్రయాణికుల కోలాహలం

అల్లర్లు సృష్టించేవారిని అదుపులోకి..

చంద్రబాబు రిమాండ్ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు విధ్వంసానికి తెగబడే అవకాశాలుంటాయనే సమాచారంతో ఉమ్మడి విశాఖ జిల్లాల్లో 144 సెక్షన్ విధించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. ర్యాలీలు, సభలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. చివరికి చోడవరంలో టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలోనూ ఒక్కరు కూడా కనిపించలేదు. అల్లూరి జిల్లాలో పలు చోట్ల సంతలు యథాతథంగా కొనసాగాయి. టీడీపీ బంద్‌కు మద్దతు కరువవ్వడంతో ఆ పార్టీ నేతలు అయోమయంలో పడిపోయారు. ఏం చేయాలో తెలియక అసహనానికి గురైన కొందరు నేతలు అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించగా.. అప్రమత్తమైన పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. చోడవరంలో బస్సులు ఆపేందుకు ప్రయత్నించిన టీడీపీ శ్రేణుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. యలమంచిలి పట్టణంలో దుకాణాలు బలవంతంగా మూసివేయించాలని చూసిన టీడీపీ, జనసేన కార్యకర్తల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. లంకెలపాలెం ప్రధాన రహదారిపై నిరసన తెలిపి వాహన రాకపోకలకు అవాంతరాలు కల్పించేందుకు ప్రయత్నించిన టీడీపీ శ్రేణుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో బంద్ ప్రభావం కనిపించలేదు. టీడీపీ, జనసేన నాయకులు దుకాణాలను మూయించేందుకు ప్రయత్నించగా వ్యాపారుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. బస్సులను అడ్డుకోవాలని చేసిన యత్నాలను పోలీసులు భగ్నం చేశారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గంలో యథావిధిగా షాపులు తెరిచారు. వ్యాపారస్తులు స్వచ్ఛంద బంద్‌కు ముందుకు రాకపోవడంతో కొంతమంది టీడీపీ కార్యకర్తలు పెట్రోల్ బంక్‌లు, హోటల్స్, స్కూల్స్, షాపులను బలవంతంగా మూయించారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడవడంతో ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. అయితే.. పోలీసులకు పెద్ద పనిలేకుండా టీడీపీ, జనసేన, వామపక్షాలే బంద్‌ని బహిష్కరించినట్లు వ్యవహరించడం కొసమెరుపు.

ప్రతి ఒక్కరికీ ఆధార్ తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుని వరకు ఆధార్ తప్పనిసరన్నారు. ఆధార్ దుర్వినియోగం జరుగుతోందని, అమాయక ప్రజల బయోమెట్రిక్ సంగ్రహించి ఆర్థిక నేరాలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ విషయంలో బ్యాంకులు, పోలీసు, ఆధార్ అధికారులు కలిసి ఆపరేషన్ నిర్వహించాలని ఆదేశించారు. ఆధార్ రీజనల్ మేనేజర్ షేక్ జావెద్ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 24 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో ఆధార్ అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2015కి ముందు ఆధార్ కార్డు తీసుకున్న వారు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. వారి గుర్తింపుకార్డు, చిరునామా ఇతర వివరాలకు సంబంధించి పత్రాలతో రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. అప్పుడే పుట్టిన శిశువుకు కూడా ఆస్పత్రిలో ఆధార్ నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఎల్‌డీవో ఉదయశ్రీ, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, జిల్లా పోస్టల్ అధికారి ఎస్.కె.పండా, పోలీసు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బురపరిచిన జైల్ ఉత్పత్తులు



సదస్సులో ప్రదర్శించిన వస్తువులను పరిశీలిస్తున్న బీపీఆర్‌డీ డీజీ శ్రీవాత్సవ్



తమిళనాడు జైలు ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులు..

ఆరిలోవ: జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సు సోమవారం విశాఖలో ఘనంగా ప్రారంభమైంది. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్‌డీ), ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో రుషికొండ ప్రాంతం సాయిప్రియ రిసార్ట్స్ లో ఈ సదస్సు ప్రారంభమైంది. రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ సదస్సు మంగళవారం ముగియనుంది. సదస్సులో కేంద్ర హోం శాఖసహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా ముఖ్యఅతిథిగా, రాష్ట్ర హోం శాఖామంత్రి తానేటి వనిత అతిథిగా పాల్గొన్నారు. వారితో పాటు బీపీఆర్‌డీ డీజీ బాలాజీ శ్రీవాత్సవ్, ఏపీ జైళ్ల శాఖ డీజీ అనీష్‌కుమార్ గుప్తా, అన్ని రాష్ట్రాలజైళ్ల శాఖ డీజీపీలు, ఐజీలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సదస్సు ఆవరణలో దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న జైళ్లలో ఖైదీలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ప్రదర్శించారు. దుస్తులు, చెక్కతో తయారుచేసిన వివిధ బొమ్మలు, ఫినాయిల్, అల్లిక బుట్టలు తదితర వస్తువులు అతిథులను ఆకట్టుకొన్నాయి. ఆయా వస్తువులు ధరలు వాటి వద్ద రాసి పెట్టారు. వీటిని తిలకించిన ఆయా రాష్ట్రాల జైళ్ల అధికారులు వారివారి జైళ్లలో కూడా ఖైదీలతో తయారు చేయించాలనే ఆలోచనకు వచ్చారు.

మత్స్యకారులకు మంచి రోజులు

- ఈ నెలాఖరున పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి భూమి పూజ
- రూ.387 కోట్లు మంజూరు
- 37.7 ఎకరాల్లో నిర్మాణం
- ఇటీవల మొగ వద్ద స్థలాన్ని పరిశీలించిన ఫిషింగ్ అధికారులు



ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్న ప్రాంతం

అచ్యుతాపురం (అనకాపల్లి): జిల్లాలో మత్స్యకారులకు మంచిరోజులు వచ్చాయి. వేలాది మంది గంగపుత్రుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ప్రతిపాదనల్లో ఉన్న పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ నెలాఖరున ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి భూమి పూజతో శ్రీకారం చుట్టేందుకు రంగం సిద్ధమైంది. జిల్లా పరిధిలో 73 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. తీరంలో ఉన్న ఆరు మండలాల పరిధిలో 31 మత్స్యకార గ్రామాలున్నాయి. 12 వేల కుటుంబాలు కేవలం చేపల వేట, విక్రయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. వీరు చేపలు విక్రయించాలంటే విశాఖ హార్బర్‌కు వెళ్లాలి. పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తే చేపల విక్రయం ఇక్కడే జరుపుకోవచ్చు. ఇక్కడి చేపలకు విదేశాల్లోనూ డిమాండ్ ఉంది.

మొగ వద్ద పరిశీలన...

పూడమడక-సీతపాలెం సరిహద్దులో ఉన్న మొగ వద్ద ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించనున్నారు. ఇక్కడ కొండ పక్క నుంచి ఉప్పుటేరు ప్రవహిస్తోంది. పూడిమడకలోకి వచ్చే బోట్లన్నీ ఈ మొగ ద్వారా ఉప్పుటేరులోకి,ఉప్పుటేరులోంచి సముద్రంలోకి వెళ్తాయి. రూ.387 కోట్లతో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం అనుసంధానం చేసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి చేయనున్నారు. దీనికి గానూ 37.7 ఎకరాలను భూమిని సేకరించారు. ఈ స్థలాన్ని ఇటీవల ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కాంట్రాక్ట్ దక్కించుకున్న ప్రతినిధి బృందం, మత్స్య శాఖ అధికారుల బృందం కలసి పరిశీలించాయి. పూడిమడక హైస్కూల్ పక్క నుంచి హార్బర్‌కు చేరుకునేందుకు పక్కా రోడ్డుని నిర్మించనున్నారు. విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్న మత్స్యసంపద మార్కెటింగ్‌కు ఈ హార్బర్ నిర్మాణం దోహదపడనుంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల భృతి కోసం 2019 నుంచి మత్స్యకార భరోసా కింద ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది. పరిహారం నేరుగా మత్స్యకారుల బ్యాంక్ ఖాతాల్లోనే నగదు జమ చేస్తోంది. ఈ ఏడాది 11,116 మంది మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో పరిహారం అందజేసింది. మరో వైపు మత్స్యకారులకు రూ.9 సబ్సిడీపై డీజిల్‌ను కూడా ప్రభుత్వం అందజేస్తోంది. ఆంధ్రా ఫిష్ పథకం కూడా మంచి ఆదరణ పొందింది.


త్వరలోనే పనులు

పూడిమడక వద్ద త్వరలోనే ఫిషింగ్ హార్బర్ పనులు ప్రారంభం కానున్నాయి. ఇటీవల సదరు కాంట్రాక్టర్ బృందం పరిశీలించింది. రూ.387 కోట్లతో హార్బర్ పనులు జరుగుతాయి. 37.7 ఎకరాల భూమిని కేటాయించారు.

– ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ విభాగ, ఇన్‌చార్జి జేడీ

పర్యాటకం.. కొత్త పుంతలు

- విశాఖ హబ్‌గా ఉత్తరాంధ్ర పర్యాటక భూములు
- హబ్ పరిధిలో 427 ఎకరాలున్నట్లు గుర్తించిన పర్యాటక శాఖ
- రెవెన్యూ శాఖ పరిధిలో వందల ఎకరాల బదలాయింపు ప్రక్రియ దాదాపు పూర్తి
- డీపీఆర్‌లు ఇవ్వాలని జీఐఎస్‌లో ఎంవోయూలు చేసుకున్న సంస్థలకు మార్గదర్శకాలు



విశాఖ నగరం





పర్యాటక భూములు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్రలో పర్యాటకాభివృద్ధి జరిగేలా సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా ప్రాజెక్టులకు ఇటీవల విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందుకు అవసరమైన భూములను ఆయా ప్రాజెక్టులకు అప్పగించేందుకు టూరిజం శాఖ కసరత్తు ప్రారంభించింది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న పర్యాటక భూముల పరిధిని విశాఖ హబ్‌గా ఏర్పాటు చేస్తూ.. ఆయా ప్రాజెక్టుల డీపీఆర్‌లకు అనుగుణంగా భూ కేటాయింపులు చేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇప్పటికే జీఐఎస్‌లో ఎంవోయూలు చేసుకున్న 15కిపైగా సంస్థలు డీపీఆర్‌లు పర్యాటక శాఖకు సమర్పించాయి.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా.. జిల్లాలో ఉన్న అపార అవకాశాలను మెరుగు పరుచుకొని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు రూపకల్పన జరుగుతోంది. విశాఖ జిల్లానూ పర్యాటక ఖిల్లాగా మార్చే దిశగా టూరిజం ప్రాజెక్టులకు కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో జరిగిన పర్యాటక ఒప్పందాల్లో సింహభాగం ఇన్వెస్టర్లు విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలను ఎంపిక చేసుకున్నారు. ఉమ్మడి విశాఖతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. జీఐఎస్‌లో పర్యాటక రంగానికి సంబంధించి రూ.8,806 కోట్లతో 64 ప్రాజెక్టులు ఉత్తరాంధ్రకు రానున్నాయి.

భూ బదలాయింపు ప్రక్రియ షురూ

విశాఖ హబ్ పరిధిలో 39 పార్సిళ్లలో 427.08 ఎకరాలున్నట్లుగా గుర్తించారు. ఇందులో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో 296.15 ఎకరాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 43.1 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో 32.78 ఎకరాలు, విజయనగరం జిల్లాలో 48.8 ఎకరాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 6.25 ఎకరాలను గుర్తించారు. ఇందులో అత్యధిక భూములు రెవెన్యూ పరిధిలో ఉండడంతో వాటిని బదలాయించాలని పర్యాటక శాఖ అధికారులు జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు. దీంతో రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టి సారించి బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రస్తుతం ఈ భూముల బదలాయింపు దాదాపు పూర్తయింది. త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి. ఈ సమయంలో ఎంవోయూలు చేసుకున్న పెట్టుబడిదారుల నుంచి కూడా ఫైల్స్ కదిలేలా చేస్తున్నారు. ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌తో పాటు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ (పీఎంయూ) కూడా అందించాలంటూ ఎంవోయూలు చేసుకున్న సంస్థలకు పర్యాటక శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటికే 15 సంస్థలకు పైగా ఏపీటీడీసీ అధికారులకు తమ ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు అందజేశాయి. దీని ద్వారా ఏ ప్రాజెక్టుకు ఏ ల్యాండ్ అవసరమవుతుందనే దానిపై నిర్ణయించి ఆయా సంస్థలకు కేటాయింపులు చేపట్టే ప్రక్రియను ప్రారంభించనున్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా

డాక్టర్ హిమశేఖర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
సత్తెమ్మతల్లి ఆలయం రోడ్డు, గవరపాలెం, అనకాపల్లి
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన
ఫోన్ నంబర్లు :
90101 06665, 70757 09205

క్లుప్తంగా

బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్‌పై అవగాహన కార్యక్రమం రేపు

అనకాపల్లి టౌన్: బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్-2023పై ఈనెల 13వ తేదీన ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సైన్స్‌ఫేర్ జిల్లా సమన్వయకర్త పి.రాజారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్లో (మెయిన్) ఉదయం 10 గంటలకు కార్యక్రమం మొదలవుతుందన్నారు. జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఒక సైన్స్ ఉపాధ్యాయుడు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సంవత్సరం బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రధానాంశం, ఉప అంశాలపై చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎస్‌ఐ దేహదారుఢ్య పరీక్షలకు 654 మంది హాజరు



అభ్యర్థుల వేలిముద్ర నమోదు చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఆరిలోవ: విశాఖ రేంజ్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాల కోసం విశాలాక్షినగర్ ఏఆర్ పోలీస్ మైదానంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలకు సోమవారం 654 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు గత నెల 25 నుంచి జరుగుతున్న విషయం తెలిసిందే. సోమవారం హాజరైన అభ్యర్థులకు ఇక్కడ పోలీస్ సిబ్బంది వేలిముద్ర వేయించి, సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం వారికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షించారు.

స్పందన అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- కలెక్టర్ కార్యాలయానికి 146 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ ఎం.జాహ్నవి

తుమ్మపాల: స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో చేసుకున్న అర్జీలకు అదే నమ్మకంతో అధికారులంతా దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం మండల కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పట్ల ప్రజలకు మరింత నమ్మకాన్ని అందించాలన్నారు. మొత్తం 146 అర్జీలు స్పందన కార్యక్రమంలో నమోదు కాగా జేసీ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అర్జీలను స్వీకరించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలని వినతి

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు, గండి నాయనబాబు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

జిల్లాలో 2 లక్షల ఎకరాల మేర సాగు విస్తీర్ణం ఉండగా, ఈ ఏడాది ఇప్పటికి కేవలం 85 లక్షల ఎకరాల్లో మాత్రం సాగు ప్రారంభమైందని వారు తెలిపారు. వరి ఆకులు ఎండిపోయి అత్యధిక శాతం వరి పంట సాగు నిలిచిపోయిందని, రైతులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాల పరిధిలో ఆయకట్టు భూముల్లో సైతం 30 శాతం వరకు మాత్రమే వరిసాగు జరిగిందన్నారు. ఇలాంటి కరువు తీవ్రత కారణంగా కరువు జిల్లాగా ప్రకటించి ప్రత్యామ్నాయ పంటలకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలన్నారు. పంట రుణాలను రద్దు చేయాలని కోరారు. వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు.

తేగాడలో భూ ఆక్రమణలపై ఫిర్యాదు

గొర్రెలు, మేకల పెంపకందార్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం ఆధ్వర్యంలో కశింకోట మండలం తేగాడ గ్రామ రైతులు కలెక్టరేట్ గేటు వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ తేగాడ గ్రామంలో గొర్రెలు, మేకల మేతకు కేటాయించిన భూములు, పెంపకందార్ల నివాస స్థలాలను నాయకులు అమ్ముకుంటూ వీరికి అన్యాయం చేస్తున్నారన్నారు. గ్రామంలో సర్వే నం.103లో 35 ఎకరాల భూమిని స్థానిక నాయకులు అక్రమించి అమ్ముకుంటున్నారన్నారు. తక్షణమే అక్రమణలను నిలిపివేసి వీరికి న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుబ్బి శ్రీనివాసరావు, ఉరికిటి శివసూర్యనారాయణ, గోకాడ దేముడు, సర్వశుద్ధి తాతారావు, పల్లా వెంకయ్యనాయుడు, చందక నాగేశ్వరరావు, కుండల శ్రీను పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

ఎస్పీ కార్యాలయానికి 21 అర్జీలు

అనకాపల్లిటౌన్ : ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 21 అర్జీలు వచ్చినట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అర్జీదారుల నుంచి సమస్యలను తెలుసుకుంటూ, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట పరిధిలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దిగువ స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ, ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలపై ఫిర్యాదు అందినట్టు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలరాయుడు, ఎస్‌ఐ వెంకన్న పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.24.63 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం లెక్కింపు సోమవారం చేపట్టారు. గత నెల 9 నుంచి ఈ నెల 11వ తేదీ వరకు హుండీల ద్వారా రూ.24 లక్షల 63 వేల 152 నగదు, 63 గ్రాముల 450 మిల్లీ గ్రాముల బంగారం, 850 గ్రాముల 100 మిల్లీ గ్రాముల వెండి వచ్చింది. అలాగే యూఎస్‌ఏకి చెందిన 92 డాలర్లు, సింగపూర్‌కి చెందిన 12 డాలర్లు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన 230 పౌండ్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్‌కు చెందిన 10 రియల్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన 10 దిరమ్స్ వచ్చాయి. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, బి.అనురాధ, సుబ్రహ్మణ్యం, సహాయ కార్యనిర్వహణాధికారి కె.రాజేంద్రకుమార్, జగన్నాథస్వామి ఆలయ ఈవో టి.రాజ్‌గోపాల్, శ్రీహరి సేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య

ఉంద్రాజవరం: మండలంలోని ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థి సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనకాపల్లికి చెందిన ఘంటా వంశీ (16) సెలవుల నిమిత్తం ఇటీవల ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం అతని తండ్రి అప్పలకొండ అతనిని తీసుకువచ్చి హాస్టల్‌లో దించి వెళ్లారు. తండ్రి వెళ్లిన కొద్దిసేపటికే హాస్టల్ గదిలో ఆ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై కె.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

మహారాణిపేట: జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ట్రైనింగ్ సెంటర్లలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) కోర్సులో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించడానికి, దరఖాస్తులు సమర్పించడానికి ఈనెల 30వ తేదీ గడువుగా నిర్ణయించినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ వెబ్‌సైట్ http@//cfw.p. nic.inలో సంప్రదించాలన్నారు.

మౌలిక విలువలతో కూడినదే సాహిత్యం

తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ అభినందన సభ



ఆచార్య ఇనాక్‌ను సత్కరిస్తున్న విద్యార్థులు, ఆచార్యులు

ఏయూక్యాంపస్: మౌలిక విలువతో కూడినదే సాహిత్యమని ఎస్వీ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఏయూ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న ఆయనను ఏయూ తెలుగు విభాగంలో ఘనంగా సత్కరించారు. తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించగా ఆత్మీయ అతిథిలుగా ఆచార్య జి.యోహాన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను తెలుగు ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్సవ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తెలుగు శాఖలో అద్భుత పాండిత్యంగల మేధావుల సాంగత్యంలో తాను రచనలో రాటుదేలానన్నారు. కన్నీళ్లమయమైన సమాజపోకడను నిశితంగా పరిశీలించి ఎత్తుపల్లాలను జేరీజు వేసి సాహిత్యం ద్వారా సమాజానికి అందించానన్నారు. తాను ఇప్పటి వరకు 104 గ్రంథాలు రచించానని వాటిలో మౌలిక అంశాలు, సార్వకాలీక సార్వజనీనమై నిలిచాయన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు లోక జ్ఞానం కోసం వివిధ ప్రాంతాల సాంస్కృతిక జీవనాన్ని అధ్యయనం చేస్తే వి/జ్ఞానం విస్తృతమవుతుందన్నారు. తనకు ఎన్ని అవార్డులు వచ్చినా మాతృసంస్థ ఆంధ్ర విశ్వకళాపరిషత్ నుంచి గౌరవ డి.లిట్ డాక్టరేట్ అందుకోవడం మధురానుభూతి కలిగించిందన్నారు. కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డాక్టర అయ్యగారి సీతారత్నం, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టెపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి), ఆచార్య గంగిశెట్టి పద్దయ్య, ఆచార్య ఉయ్యూరి భాస్కరరావు, డాక్టర్ ఎస్. పుల్లారావు, ఎస్.అంబేద్కర్ రాజు, డాక్టర్ ఎల్.గిరీష్ కుమార్, పట్నాన ధర్మారావు, మొండి స్వామి, రామారావు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ లభ్యం

మునగపాక : అదృశ్యమైన ఇంటర్ విద్యార్థిని ఆచూకీ లభ్యమైందని ఎస్‌ఐ మహమ్మద్ అలీ తెలిపారు. మునగపాక గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని ఈ నెల 3న కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కేసు విచారణ చేపట్టారు. కొద్ది రోజులుగా ఆమె కోసం గాలింపు చేపట్టారు. రాజమండ్రిలో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు బాలికను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. తన చదువుకు సంబంధించి తల్లిదండ్రుల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక ఇంటి నుంచి వెళ్లిపోవాల్సి వచ్చిందని విద్యార్థిని చెప్పిందని ఎస్‌ఐ అలీ తెలిపారు.

ముగిసిన తుంపాల అప్పారావు అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఆత్మీయులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సబ్బవరం : జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు అంత్యక్రియలు స్వగ్రామం మర్రిపాలెంలో సోమవారం ముగిశాయి. గత ఎన్నికల్లో సబ్బవరం జెడ్పీటీసీ సభ్యునిగా విజయం సాధించి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈ క్రమంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఆత్మీయులు, బంధువులు అంతిమ యాత్రలో పాల్గొని అప్పారావు పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ,, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చోడవరం నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, బోకం రాము నాయుడు, మోపాడ అప్పారావు, రాపేటి రాము తదితరులు పాల్గొన్నారు.

మాజీ హోంగార్డు ఆత్మహత్య

అనకాపల్లిటౌన్ : ఓ వ్యక్తి ఆదివారం రాత్రి బలవన్మరణం చెందాడు. పట్టణ హెచ్‌సీ రామకృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక గొల్లవీధికి చెందిన అప్పలరాజు(53) ఆదివారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య జయలక్ష్మి మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన అప్పలరాజు పక్క గదిలోకి వెళ్లి ఉరిపోసుకొని మృతి చెందాడు. గతంలో మృతుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించేవాడు. సమయపాలన పాటించకపోవడంతో అప్పలరాజును విధుల నుంచి తొలగించారు. కొంతకాలంగా ఖాళీ ఉంటున్నాడు. ఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ చెప్పారు.

తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం-తిరుపతి (08583) స్పెషల్ సుమారు 1.20 గంటల ఆలస్యంగా బయల్దేరింది. అటు నుంచి రావలసిన పెయిరింగ్ రైలు రాక ఆలస్యం కారణంగా ఈ రైలు విశాఖపట్నంలో సుమారు రాత్రి 8.30 గంటలకు బయల్దేరింది.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట : యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ వారిచే ఈ నెల 9, 10 తేదీలలో కర్నూల్ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం నందు జరిగిన 48వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల నందు శ్రీ ప్రకాష్ విద్యార్థులు అండర్ 10,12 విభాగంలో బి.దేవాన్ష్ నాయుడు (7 వ తరగతి) ప్రథమ స్థానాన్ని, జి.సోమసూర్యచరణ్ (6 వ తరగతి) ద్వితీయ స్థానాన్ని, అండర్ 8-10 విభాగంలో సిహెచ్.జయదీప్ (4 వ తరగతి) ద్వితీయ స్థానాన్ని, అండర్ 12-14 విభాగంలో జి.హర్షవర్ధిని (8వ తరగతి) తృతీయ స్థానాన్ని సాధించి నవంబర్ 23 నుంచి 26 వరకు అస్సాం రాష్ట్రం గౌహతిలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, అకడమిక్ ఇన్‌ఛార్జిలు, యోగా గురువులు అభినందించారు.

జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

అనకాపల్లి టౌన్ : గవరపాలెం మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి జంప్ రోప్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు చెప్పారు. పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 9,10,11 తేదీల్లో తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో తమ విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. 12 సంవత్సరాల సబ్ జూనియర్ విభాగంలో జి.హేమంత్, కె.సందీప్, పి.సాయిచరణ్, 14 సంవత్సరాల జూనియర్ విభాగంలో వై.సూర్యనారాయణ ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్ మోహన్, పాఠశాల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీర్‌గాథ 3.0పై విద్యార్థులకు పోటీలు

అనకాపల్లిటౌన్: కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ సహకారంతో 2023-24 విద్యా సంవత్సరానికి వీర్‌గాథ 3.0ని ప్రారంభించినట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీర్‌గాథ ప్రాజెక్టులో పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు గ్యాలంట్రీ పురస్కారాలు పొందిన వీరుల త్యాగాలు, శౌర్యప్రతాపాలు కనబరిచిన వీరుల ధైర్య సాహసాల పట్ల అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు పద్యాలు, వ్యాసాలు, మల్టీమీడియా వంటి సృజనాత్మక ప్రాజెక్టుల ద్వారా తమలో దాగివున్న దేశభక్తి, సామాజిక స్పృహను పదునుపెట్టుకోవచ్చన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, హైస్కూల్ ప్లస్, ఇంటర్ విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చన్నారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి విజేతలకు రానున్న రిపబ్లిక్ డే(జనవరి 26)నాడు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, కరెస్పాండెంట్లు తమ విద్యార్థుల ప్రతిభకు పదునుపెట్టి, వారి కృత్యాలను మూల్యాంకనం చేసి మై గవర్నమెంట్ పోర్టల్‌లో ఈ నెల 15వ తేదీ లోపు అప్‌లోడ్ చేయాల్సిందిగా కోరారు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి



బుచ్చెయ్యపేట: మండలంలోని ఆర్.భీమవరం గ్రామానికి చెందిన అప్పబత్తుల అయ్యన్న ఆచారి (62) ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందాడు. మూడు నెలలుగా మంచానికే పరిమితమై సోమవారం ఆయన మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

చేపలపై వాతావరణం ఎఫెక్ట్

- అధిక ఉష్ణతాపం, వర్షాభావంతో తగ్గుతున్న లభ్యత
- ఈ ఏడాది వీటి ప్రభావం వేటపై చూపుతుందంటున్న నిపుణులు
- గతేడాదికంటే మత్స్య సంపద తగ్గుతుందని మత్స్యశాఖ అంచనా



హార్బర్‌లో బోట్ల నుంచి చేపలను దించుతున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం : చేపల లభ్యతపై వాతావరణం ప్రభావం చూపుతోంది. అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులతో వీటి లభ్యత తగ్గుతోంది. కొన్నేళ్లుగా చేపలవేటకు వెళ్లిన తమకు చేపలు ఆశాజనకంగా లభించడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. దీనివల్ల చేపలవేట తమకు గిట్టుబాటు కాని పరిస్థితులు తలెత్తుతున్నాయని అంటున్నారు. ఇందుకు వాతావరణ మార్పులు, అసాధారణ ఉష్ణోగ్రతలు కూడా ఓ కారణమని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో వేసవి తీవ్రత అధికంగా ఉండడమే కాదు.. ఎక్కువ రోజుల పాటు కొనసాగుతోంది. పైగా వర్షాలు కూడా గతి తప్పుతున్నాయి. వేసవి రోజులకంటే వర్షాకాలం, శీతాకాలం సీజన్లలో చేపలు పుష్కలంగా లభిస్తాయి. ఇందుకు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండడం ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 26-28 డిగ్రీల మధ్య, సముద్రం అడుగున 14-18 మధ్య ఉంటాయి. సముద్రంలో చేపలు చల్లటి ఉష్ణోగ్రతల్లోనే ఎక్కువగా తిరుగుతుంటాయి. సముద్ర జలాలు తరచూ పైకి, కిందకు (అప్‌వెల్లింగ్, డౌన్‌వెల్లింగ్) కదులుతూ ఉంటాయి. చేపలకు పోషకాహారమైన ప్లవకాలు (ప్లాంక్టాన్లు) చల్లని నీటిలోనే పెరుగుతాయి. అలాంటి చోట్ల చేపలు తిరుగుతాయి. సముద్ర జలాలు చల్లగా ఉంటే అవి తరచూ పైకి వస్తుంటాయి. ఆ సమయాల్లో మత్స్యకారుల వలలకు బాగా చిక్కుతుంటాయి. కానీ ఉపరితల ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటే నీరు కూడా వేడెక్కి చేపలు పైకి రాకుండా సముద్రం దిగువన లోతుల్లోనే (డీప్ సీ)లోనే ఉండిపోతుంటాయి. ఈ వేడిని అవి తట్టుకోలేక చల్లని ఉష్ణోగ్రతలున్న దూర ప్రాంతాలకు వెళ్లిపోతుంటాయని విశాఖలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ) ప్రిన్సిపల్ సైంటిస్ట్ బి.మధుసూధనరావు 'సాక్షి'కి చెప్పారు.

మరోవైపు సముద్ర జలాలు వేడిగా ఉంటే చేపల్లోని రక్తం కూడా వేడెక్కుతుంది. ఈ పరిస్థితుల్లో చేపలు సముద్రం ఉపరితలంపైకి రాకుండా అనువుగా ఉండే మరో ప్రాంతానికి తరలి పోతుంటాయని, మత్స్యకారులకు చేపల లభ్యత తగ్గిపోవడానికి ఇదొక కారణమని మత్స్యశాఖ జిల్లా అధికారి జి.విజయ 'సాక్షి'కి తెలిపారు. ఏటా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో మత్స్య సంపద తగ్గుతూ వస్తోంది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే చేపలవేట ఆశాజనకంగా ఉంటోందని, ఎండల తీవ్రత ఉంటే అరకొరగా ఉంటోందని వైశాఖి డాల్ఫిన్ బోటు ఆపరేటర్ల సంక్షేమ సంఘం కార్యదర్శి సూరాడ సత్తిబాబు 'సాక్షి'తో చెప్పారు.

ఈ నేపథ్యంలో మత్స్యశాఖ ఏటికేడాది తమ మత్స్య ఉత్పత్తుల లక్ష్యాన్ని తగ్గించుకుంటోంది. ఉదాహరణకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి చేపలు, రొయ్యల ఉత్పత్తి లక్ష్యం 1,29,785 టన్నులుగా నిర్దేశించింది. అది 2023-24 సంవత్సరానికి 1,28,020 టన్నులకే పరిమితమైంది. కొన్నేళ్ల నుంచి వివిధ కారణాల వల్ల భూతాపం (గ్లోబల్ వార్మింగ్) పెరిగిపోతోంది. ఫలితంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు (సీ సర్ఫేస్ టెంపరేచర్స్) కూడా పెరుగుతున్నాయి. సాధారణంగా భూ ఉపరితల ఉష్ణోగ్రతల కంటే సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. అయినప్పటికీ కొన్నేళ్లుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం మత్స్యసంపద లభ్యతపై చూపుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఉగ్గినపాలెంలో అభివృద్ధి ఉరకలు

- రూ.2.05 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- నేడు మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా ప్రారంభం

గ్రామాలు అభివృద్ధి చెందితే.. దేశం అభివృద్ధి చెందినట్లే. జాతి పిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్ పాలనలో సాకారమవుతోంది. పంచాయతీల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. రూ.కోట్ల నిధులు వెచ్చించి, గ్రామీణులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. కశింకోటలోని ఉగ్గినపాలెం పంచాయతీ ఇందుకు ఓ చక్కని ఉదాహరణ.

కశింకోట: మండలంలోని మారుమూల గ్రామమైన ఉగ్గినపాలెం గ్రామ పంచాయతీ గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి నోచుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏకంగా రూ.2 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వీటిలో రూ.కోటి 85 లక్షల విలువైన పనులను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు.

మారుమూల గ్రామం.. అభివృద్ధిలో వేగం

మండలంలో ఒక మూలన ఉన్న ఉగ్గినపాలెం పంచాయతీలో 2,500 మందికి పైగా జనాభా ఉన్నారు. ఒకప్పుడు ఏ చిన్నపాటి అవసరానికైనా మండల కేంద్రం లేదా, అనకాపల్లి పట్టణానికి పరుగులు తీయాల్సి వచ్చేది. ఇపుడా పరిస్థితి లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఒకటొకటిగా పలు అభివృద్ధి పనులను చేపట్టి, పూర్తి చేశారు. ఎంపీపీ కలగా లక్ష్మి సొంత గ్రామం అయిన ఉగ్గినపాలెంలో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలన్నింటినీ దాదాపుగా ఏర్పాటు చేశారు. రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, పంచాయతీ కార్యాలయం, సచివాలయానికి సొంత భవనం, సంపద తయారీ కేంద్రం ఇలా ప్రతి ఒక్కటీ ఏర్పాటయింది.

మౌలిక వసతులకు ప్రాధాన్యత

గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యతనిచ్చారు. ప్రభుత్వం నుంచి అడిగినంత మేర నిధులు మంజూరు కావడంతో, తమకు కావాల్సిన ప్రతి సౌకర్యాన్ని ప్రజలు ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారం మర్చిపోలేనిదని గ్రామస్తులు చెప్పారు. నాడు–నేడు మొదటి, రెండో విడతల్లో ప్రాథమికోన్నత పాఠశాలకు మెరుగులు, అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఏర్పాటు చేసుకున్నారు. తాగునీటి ఇక్కట్లకు చెక్‌పెట్టేలా ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలిచేలా ప్రతి ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్నీ సద్వినియోగం చేసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో సుమారు రూ.2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఉగ్గినపాలెంలో నిర్మించిన పంచాయతీ, సచివాలయ కార్యాలయాల భవనం

నేడు ప్రారంభం కానున్న అభివృద్ధి పనులు

- రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ.19.65 లక్షలతో పంచాయతీ కార్యాలయం
- రూ.25 లక్షలతో సచివాలయ భవనం
- రూ.24.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్
- రూ.20 లక్షలతో సంపద తయారీ కేంద్రం
- రూ.16 లక్షలతో అంగన్‌వాడీ భవనం
- రూ.18.86 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాల ఆధునీకీకరణ
- రూ.19.40 లక్షలతో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్
- రూ.20 లక్షలతో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం
- రూ.3 లక్షలతో కమ్యూనిటీ కాంప్లెక్స్


నాడు–నేడులో అభివృద్ధి చేసిన ప్రాథమికోన్నత పాఠశాల


వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

ఎన్నడూ చూడనంత అభివృద్ధి



ఉగ్గినపాలెంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. విద్య, వైద్యం, ఆరోగ్యానికి ప్రాధాన్యత పెరిగింది. స్కూల్‌ను చాలా బాగా అభివృద్ధి చేశారు. పిల్లలు ఆనందంగా స్కూల్‌కు వెళ్తున్నారు. పంచాయతీ, సచివాలయ కార్యాలయ భవనం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు, రోడ్లు, డ్రైనేజీలు తదితర పనులు చేపట్టారు. ఆనందంగా ఉంది.

–కలగా ప్రసాద్, ఉగ్గినపాలెం

వసతులు పెరిగాయి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. ఒకప్పుడు రోడ్లు, కాలువలు అధ్వానంగా ఉండేవి. వైద్యం కోసం పట్టణానికి పరుగులు తీయాల్సి వచ్చేది. రైతుల అవసరాలు గ్రామంలోనే తీరిపోతున్నాయి. సచివాలయం, రైతు భరోసా కేంద్రంలో అన్ని వసతులు కల్పించారు. పాలన చాలా గొప్పగా ఉంది.

–జల్లూరి అప్పారావు, ఉగ్గినపాలెం

రూ.2 కోట్లతో అభివృద్ధి



ఉగ్గినపాలెం పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో నిధులు వచ్చాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో మా పంచాయితీలో రూ.2.05 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులు చేపట్టి, పూర్తి చేశాం. వీటిని మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించడానికి సన్నాహాలు పూర్తిచేశాం.

–కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్, ఉగ్గినపాలెం

బంద్ ప్రభావం నిల్


యథావిధిగా తిరిగిన ఆర్టీసీ బస్సులు

అనకాపల్లిటౌన్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా ఆ పార్టీ శ్రేణులు పట్టణంలో సోమవారం తలపెట్టిన బంద్ ప్రభావం కనిపించలేదు. బంద్ నేపథ్యంలో పోలీసు అధికారులు పట్టణమంతా జల్లెడ పట్టడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. స్థానికంగా దుకాణ సముదాయాలతోపాటు అటు ప్రజా రవాణాశాఖకు చెందిన ఆర్టీసీ బస్సులు నిలిపివేయకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. దుకాణ సముదాయాల్లో రోజు మాదిరిగానే లావాదేవీలు కొనసాగాయి. జనసేన నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. రహదారులపై బైఠాయించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, జనసేన నేతలు దూలం గోపి, మళ్ల శ్రీనుతోపాటు 27 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మళ్ల సురేంద్రలను గృహనిర్బంధంలో ఉంచారు.

కశింకోట:మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అరెస్టును నిరసిస్తూ టీడీపీ, జనసేన మద్దతుతో మండలంలో సోమవారం నిర్వహించిన బంద్ పెద్దగా ప్రభావం చూపలేదు. బస్సులు, ఆటోలు యథావిధిగా నడిచాయి. కశింకోట, తాళ్లపాలెం, నరసింగబిల్లి ప్రాంతాల్లో కొన్ని దుకాణాలు, స్కూళ్లు, బ్యాంకులు మాత్రం మూసివేశారు. కూరగాయల దుకాణాలు ఎప్పట్లానే తెరిచారు. జన జీవనాన్ని బంద్ పెద్దగా ప్రభావితం చేయలేదు. టీడీపీతోపాటు జనసేన శ్రేణులు బంద్ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

క్లుప్తంగా

ఉగ్గినపాలెంలో 'గడప గడపకు' నేడు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చర్యలు చేపడతారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు, అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాల్సిందిగా కోరారు.

చిరుజల్లులు కురిసెను


సంతబయలలో కురుస్తున్న వర్షం

కశింకోట: కశింకోట ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వీధులు చిత్తడిగా మారాయి. మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మబ్బులు వేసి వర్షం ప్రారంభమైంది. కొంతసేపు మోస్తరుగా వర్షం పడిన తర్వాత నుంచి సాయంత్రం వరకు జల్లులు కొనసాగాయి. ఈ వర్షం ఖరీఫ్ వరి నాట్లకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాడిరైతు కుటుంబానికి బీమా పరిహారం అందజేత


బీమా పరిహారాన్ని అందిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పాల సంఘం సభ్యుడు, ఇటీవల మృతి చెందిన పాడి రైతు విరోదుల శ్రీనుబాబు కుటుంబానికి విశాఖ డెయిరీ తరఫున రూ.లక్ష బీమా పరిహారాన్ని మంజూరు చేశారు. డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు చేతుల మీదుగా ఈ మొత్తాన్ని మృతుని భార్య సంతోషికి సోమవారం అందించారు. కార్యక్రమంలో డెయిరీ అసిస్టెంట్ మేనేజర్ ఇ.శ్రీనివాసరావు, సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు లగిశెట్టి గణేష్, ఇందల ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 323 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	4,050	4,400
మూడోరకం	3,810	4,080

అనకాపల్లి సినిమాలు

ది నన్	: రాజా
గోవిందా భజగోవిందా	: సత్యనారాయణస్క్రీన్-1
తురుమ్ ఖాన్‌లు	: సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	: షిర్డిసాయి
జవాన్	: షిర్డిసాయి
జవాన్	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
ఖుషి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–8 యూనిట్లు, బీ పాజిటివ్–10 యూనిట్లు, బీ నెగిటివ్–2 యూనిట్లు, ఓ పాజిటివ్–18 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (98484 18400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 336 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం


రోడ్డు ప్రమాద మృతుని కుటుంబానికి సాయం చేస్తున్న మిత్రులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి స్నేహితులు, దాతలు రూ.70 వేలు ఆర్థిక సాయం అందించి, ఆసరాగా నిలిచారు. తాళ్లపాలేనికి చెందిన కర్రి నూకరాజు సమీపంలోని ఓ సిమెంట్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తూ, ఇంటికి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. దీంతో అతని టెన్త్ బ్యాచ్ స్నేహితులు కుటుంబానికి అండగా నిలవాలని భావించి రూ.35 వేలు సమకూర్చారు. స్థానిక బీజేపీ నాయకుడు గళ్లా రాజు రూ.10 వేలు, సిమెంట్ పరిశ్రమ లేబర్ కాంట్రాక్టర్ రూ.25 వేలు సాయం చేశారు. ఈ మొత్తాన్ని నూకరాజు కుటుంబానికి సోమవారం అందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో టెన్త్ బ్యాచ్ స్నేహితులు కర్రి లోవరాజు, గుమ్మడి శ్రీను, అనిల్, చిన్ని నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

'మట్టి వినాయకుడినే పూజిద్దాం'


మట్టి విగ్రహాలను ప్రదర్శిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినాయక చవితికి వారివారి గృహాల్లో, వీధుల్లో మట్టి గణపతిని పూజించాలని పిలుపునిచ్చారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వినాయక నిమజ్జనోత్సవాల్లో నది, కాలువల్లో దిగే సందర్భాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సామూహిక నిమజ్జనోత్సవ కమిటి చైర్మన్ ఆడారి కుమారస్వామి, కమిటీ సభ్యులు పి.సోమశేఖర్ పట్నాయక్, ఆళ్ల నాగేశ్వరరావు, తాటికొండ శ్రీకాంత్, కాండ్రేగుల సర్వేశ్వరరావు, పోలారపు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనానికి నిధుల మంజూరు


సామాజిక భవనం నిర్మాణానికి నిధుల మంజూరు పత్రాలను అందిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా తన పార్లమెంట్ పరిధిలో అంబేడ్కర్ పేరిట సామాజిక భవన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిధుల విడుదల పత్రాలను కశింకోట గ్రామ సర్పంచ్ జయరజినికి అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతలో కశింకోటలో సామాజిక భవన నిర్మాణానికి స్థానికులు వినతి పత్రం అందించారని, ఆ మేరకు ఈ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కశింకోట నాయకులు ఎం.అప్పలనాయుడు, బి.సత్యారావు, ఎస్.సత్యనారాయణ, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి ప్రోత్సాహం


దివ్యాంగులకు వినికిడి యంత్ర సామగ్రి అందజేస్తున్న పరిశీలకులు డాక్టర్ రామ్‌కమల్, నరసింహం

పరవాడ: దివ్యాంగుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్య పరిశీలకులు డాక్టర్ రామ్‌కమల్, డాక్టర్ వై.నరసింహం చెప్పారు. పరవాడ భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష సహిత విద్య పరిశీలకుల బృందం సోమవారం సందర్శించింది. భవిత కేంద్రంలో దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలో 27 మంది బుద్ధిమాంద్యం కలిగిన చిన్నారుల అవసరాలు తీర్చడానికి వీలుగా ప్రభుత్వం రూ.2.70లక్షలతో సమకూర్చిన బోధన సామగ్రి కిట్లు, వినికిడి లోపం కలిగిన ఆరుగురు చిన్నారులకు రూ.1.80 లక్షల విలువైన వినికిడి యంత్రాలను పరిశీలకులు రామ్‌కమల్, నరసింహం అందజేశారు. అనంతరం కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో నిర్మించిన భవిత కేంద్రం పరిశీలించి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అభినందించారు. అనకాపల్లి సహిత విద్య సమన్వయకర్త శకుంతల భవిత కేంద్ర పురోగతిని పరిశీలకులకు వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దివాకర్, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, మహాలక్ష్మినాయుడు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 30 మంది రోగులు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యుడు

అనకాపల్లిటౌన్: ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో భాగంగా తీసుకుంటే ఆరోగ్యంగా జీవించడమే కాకుండా కంటిచూపు మందగించదని విశాఖ శంకర్ ఫౌండేషన్ క్యాంప్ డిప్యూటీ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం కేఎస్ఆర్‌పేటలో శంకర్ ఫౌండేషన్, శ్రీ సీతారామ మహిళా సేవాసంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 140 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా 30ని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరి ఆపరేషన్‌కు కావలసిన అన్ని రకాలైన పరీక్షలు చేసి, ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సీతారామ సేవా సంఘం వ్యవస్థాపకుడు చూచుకొండ రమణ, సభ్యులు కశిరెడ్డి శ్రీనివాసరావు, సుశీల, బల్లిన నాగమణి, నూకరత్నం, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తుప్ప పట్టిన విద్యుత్ వైర్ల తొలగింపు


తుప్ప పట్టిన విద్యుత్ వైర్లను తొలగించి కొత్త వైర్లను బిగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: తీరప్రాంత గ్రామాల్లో విద్యుత్ పరమైన సమస్యలను పరిష్కరించడానికి ఈపీడీసీఎల్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. తీర ప్రాంతం సమీపంలోని ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాల్లో ఉప్పుగాలికి తుప్పుపట్టిన వైర్లు తొలగించి నూతన వైర్లు వేశారు. పాత కేశరాలు, యాంగ్లర్లను తొలగించి కొత్త వాటిని అమర్చారు. లోవోల్టేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఏఈ శేషసాయి చెప్పారు. సమస్యను పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

కశింకోట: స్థానిక శివాలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి, దర్శనాలు చేసుకున్నారు. మధ్యాహ్నం పేదలకు అన్న సమారాధన నిర్వహించారు. కస్పావీధి సాంబశివుని ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిపారు.

వర్షాలతో పొలం పనుల్లో రైతులు బిజీ

అనకాపల్లిటౌన్: అల్ప పీడన ప్రభావంతో వర్షాలు దంచికొడుతున్నాయి. సోమవారం గంటపాటు ఎడతెరిపివ్వకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లో భారీగా నీరు చేరింది. రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎండిపోయే దశకు చేరుకున్న వరినారుకు ఈ వర్షాలు జీవం పోశాయి. దీంతో వ్యవసాయ పనుల్లో రైతులు తలమునకలవుతున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మునగపాక : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని మొబైల్ ఐటీసీ కౌన్సిలర్ అర్జున్ కోరారు. అచ్యుతాపురం మండలం మార్టూరు, మడుతూరు గ్రామాల్లో సోమవారం ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని అలాగే గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 43 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎల్‌టీ కిషోర్, లింక్ వర్కర్ బి.సత్యనారాయణ, సర్పంచ్ రమేష్‌బాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాట మహోత్సవం


ఉత్సవ రాట వేస్తున్న భక్తులు

రాంబిల్లి : దిమిలిలో సోమవారం గణపతి నవరాత్రి ఉత్సవాల రాట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు కె.టి. దీక్షితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ నెల 18 న గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని దీక్షితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

మునగపాక : నాగులాపల్లి జేపీ అగ్రహారంలో సోమవారం అభయాంజనేయస్వామి పంచ ముఖ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దొడ్డి శ్రీనివాసరావు సమకూర్చిన నిధులతో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఇంటింటా ధర్మ ప్రచారం


స్టిక్కర్లతో ప్రచారం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాంబిల్లి : వాడ నర్సాపురం గ్రామంలో సోమవారం ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించారు. సమరసత ఫౌండేషన్ ప్రతినిధి గగన్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవం మతం కాదని, ధర్మ విధానమని తెలిపారు. స్టిక్కర్లతో ధర్మ ప్రచారం, భజనలు నిర్వహించారు.

30 నుంచి సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలు


మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మండల పరిషత్ హాలులో సోమవారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ నెల 30 నుంచి ప్రతి సచివాలయ పరిధిలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు బాధ్యత తీసుకోవాలన్నారు. ముందుగా ఆయా సెక్టార్ల వారు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాల్సి ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకొని విజయ వంతం చేయాలన్నారు. ఎంపీడీవో మన్మథరావు, డీటీ వినయ్‌కుమార్, ఎంఈవో శివనాయుడు, వైద్యాధికారులు దుర్గా ప్రవళిక, వినోద్ పాల్గొన్నారు.